# మానవుని మంచి, చెడ్డలు సంకల్పములపై ఆధారపడియున్నవి

వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు ఇవ్వల జీవి దేవుడవ్వలనుండు
కార్యమివల, నవల కారణంబు

మనసునందు మంచి మాటలందున మంచి
నడతలందు మంచి పొడమకున్న
సాయి యెట్లు మెచ్చి సంతోషమును యిచ్చు
చెప్పరయ్య మీరె ఒప్పుకుందు

ఫిల్మురికార్డింగు ప్లేటును చూచిన
ఒక్కరీతిగానె పొసగియుండు
సౌండుబాక్సునందు సవరించి చూచిన
పాటలెన్నోతీర్లు పలుకుచుండు

ఆధ్యాపకులారా! విద్యార్థులారా!

పశుత్వము, దైవత్వము అను రెండు తత్త్వములతో కూడినదే మనస్సు. కామక్రోధాది అరిషడ్వర్గములకులోనై మానవుడు దుష్టుడై, దుర్గతిని పొంది పతితుడై పశువుకంటే హీనమైపోతున్నాడు. అట్లుకాక కాలమును, కాయమును, కర్మను, స్థితిని, గతిని, ధర్మబుద్ధితో ఉత్తమ భావములతో నీతినిజాయతీలతో మానవత్వాన్ని, మానవత్వముకంటే మిన్నయైన దైవత్వాన్ని పొందటం ఒక మార్గము. సత్సంకల్పములను పెంచి కొంతమందికి పంచి యిదే మానవునియొక్క ప్రధానమైన ధర్మమని భావించి సర్వ పదార్థములను

sri sathyasai vachanamrutam

సద్వినియోగపరచుకోటం యిది ప్రధానమైన కర్తవ్యము, మానవునకు. చూచుటకు మానవులందరు ఒక్కటే అయినప్పటికి, 'ముండే ముండే మతిర్భిన్నః' అని ఒక్కొక్కరి తలంపులు వేరుగా నడతలు వేరుగా, మాటలు వేరుగా కనుపించుచున్నవి. ఈ మూడింటియొక్క యేకత్వమును గావించి, దివ్యత్వమును చింతించి, మానవత్వమును సార్థకము చేసుకోటమే మనసుయొక్క ప్రధాన కర్తవ్యము. సంకల్పములు ఎట్టివో తనయొక్క స్థితిగతులుకూడను అట్టివే! కనుక, మానవునియొక్క మంచి చెడ్డలు సంకల్పములపై ఆధారపడివుంటున్నవి.

**పరదూషణ, పరనింద, పరపీడన మహాపాతకమైన కార్యములు**

ఈ సంకల్పములు రెండు విధములైన సంకల్పములుగా వుంటున్నవి. ఒకటి శుద్ధ సంకల్పము, రెండవది అశుద్ధ సంకల్పము. ఎప్పుడు పరులయొక్క దోషమును వెతకటము, పరుల కీడును ఆశించటము, పరులను పీడించటము, పరులకు దుఃఖమును అందించటము, దివ్యత్వమును విస్మరించటము, అపవిత్రతను విశ్వసించటము యీ విధమైన చర్యలయందు తనయొక్క సంకల్పములను ప్రవేశపెట్టటము అశుద్ధ సంకల్పములయొక్క ప్రభావము. యీ అశుద్ధ సంకల్పములు ప్రథమములో తనకు ఆనందముగా కనుపించవచ్చును. తనయొక్క చర్యలు తనకు మంచివిగా కనుపించవచ్చును. కాని, క్రమేణా అవి చాలా ప్రమాదమునకు గురిచేయగలవు. ఇతరుల కీడును మనము తలపెట్టినప్పుడు అవి కొంతవరకు యితరులకు కీడు చేయవచ్చును కాని, ఎదురు తిరిగి యీ కీడును తలపెట్టినవానికే అనేక విధములుగా కీడును చేకూర్చును. కనుక పరదూషణ, పరనింద, పరులను పీడించటము యివి మహాపాతకముగా మనము భావించాలి. సంకల్పములయొక్క ప్రభావము మానవునియందు క్షణక్షణము కనుపించుచున్నది.

**జగత్తంతయు మనస్సుయొక్క స్వరూపమే!**

'సంకల్పవికల్పకాత్మకమ్ మనః' అని మనస్సుయొక్క ప్రభావము సంకల్పవికల్పములతో కూడియుండటమే కాకుండా యీ సంకల్పములను నిరంతరము మననము

sri sathyasai vachanamrutam

చేయుచుండును. కనుక, దుస్సంకల్పములకు మనము యేమాత్రము స్థానము యివ్వరాదు. పరులక్షేమమును, పరుల ఆనందమును, లోక కళ్యాణమును ఆశించి దైవచింతనచేత సదాలోచనలు, సచ్చింతనలు సలిపి జీవితము సద్గతికి చేరే మార్గము చూచుకోవాలి. ఇదే మనస్సుయొక్క ప్రధానమైన ఫలితము. సమస్త పదార్థములుకూడను సంకల్పములయొక్క స్వరూపములే! పాంచభౌతికమైన యీ ప్రపంచము, యీ దేహముకూడా సంకల్పములయొక్క స్వరూపమే! ఈ జగత్తంతయు సంకల్పమునుండియే ఆవిర్భవించినది. 'మనోమూలమిదంజగత్' అని జగత్తంతయు మనస్సుయొక్క స్వరూపమే! ఈ సంకల్పములు మనిషినుండి మనిషికి ప్రయాణము చేయవచ్చును. సంకల్పములు చాలా శక్తివంతమైనవి. ప్రపంచమునే స్తంభింప చేయగలవు. ప్రపంచమునే తన హస్తగతము గావించుకొనగలవు. ప్రపంచమునే కదిలించగలవు. ఇట్టి సంకల్పములయొక్క ప్రభావము మనము గుర్తించుకొనక, నిత్యానిత్య విషయ పరిశీలన సలపక సంకల్పములను మనము యేదో విధముగా స్వేచ్ఛగా వదలిపెడుతున్నాము. కనుకనే, మానవుడు అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు గురియగుచున్నాడు. ప్రతి సంకల్పముయొక్క మంచి, చెడులను మనము చక్కగా విచారించి ఆచరణలో పెట్టాలి.

**ఒక్క మనస్సునందు వున్నది లోకంబు**
**తిక్కబట్టి నరుడు తిరుగనేల**

అన్నాడు వేమన. తనయొక్క తత్త్వము తనయందే వున్నప్పుడు గుర్తించుకొనక వెలుపల ప్రపంచములో యేదో వున్నదని ప్రాకులాడుతున్నాడు, పిచ్చిమానవుడు. సామాన్యమైన మానవునికూడను మాధవత్వముగా రూపొందింపజేసేదే సంకల్ప ప్రభావము. పామరుని పరమహంసగా మార్చవచ్చు. మానవుడు మాధవత్వాన్ని పొందవచ్చు. నరుడు వానరుడుగా కావచ్చు. మనిషి రాక్షసుడుగా మారవచ్చు. ఈ అన్నింటికిని సంకల్పములే కారణములు. ఆనాటి పామరులు పరమహంసలవలె, మహర్షులవలె, యోగులవలె తయారుకావటానికి యేమి కారణము? వారి పవిత్రమైన సత్సంకల్పములే! సంకల్పములు యే స్వరూపాన్ని చింతించునో దానియందు తాదాత్మ్య భావన పొందుతుంటాయి. మనము చెడ్డను సంకల్పించితిమా చెడ్డ స్వరూపాన్ని పొందుతాము. మంచినే చింతించిన మంచి

srisathyasaivahini

ఆకారమును పొందుతున్నాము. బంగారును కరగించి ఒక మూసలో పోసినప్పుడు కరగించిన బంగారమంతయు ఆ మూసయొక్క ఆకారమునే పొందుతుంది.

## ఎట్టి స్థితియో అట్టి గతి

ఆనాటి మహర్షులు నిరంతరము దైవమునే చింతించుచూ దైవచింతనయందే తమ మనసును లీనము గావించుతూ కాలమును, కర్మమును, కాయమును దైవత్వమునకు అంకితము గావించటముచేతనే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' అన్నట్లుగా తాముకూడను అట్టి స్థితిని, గతిని అనుభవించగలిగారు. 'యద్భావం తద్భవతి'. ఎట్టి స్థితియో అట్టిగతి. మనము మంచిని తలచి, మంచిని చేసి, మంచిని చూచి, మంచిని చింతించటము అత్యవసరము. మనిషిని నడపునది మనసే. అట్టి మనస్సును పురస్కరించుకొనియే ప్రవర్తనలు రూపొందుతున్నాయి. కనుక, మనసు చాలా ప్రధానమైనది. అయితే మనసుకు ఒక విధమైన దోషము వుంటున్నది. నేను వేరు, దేవుడు వేరు అనేదే దానియొక్క ప్రథమ దోషము. వేద, శాస్త్ర, యితిహాస, పురాణములు, భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులుకూడను 'నీవే బ్రహ్మము, ఆత్మయే బ్రహ్మము' అని బోధించుచున్నప్పటికిని మానవుడు తన అజ్ఞానము విడువక నిరంతరము తాను వేరు, దైవము వేరు అనే భేదభావమునకే గురిఅవుతున్నాడు. సమస్త మత గ్రంథములుకూడను యేకత్వమునే బోధిస్తున్నాయి. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అనే సమిష్టి స్వరూపాన్ని సమస్త గ్రంథములు తెలుపుతూ వచ్చాయి. కాని యిట్టి సత్యమును గుర్తించుకొనలేక తన స్వస్వరూపాన్ని దర్శించుకొనలేక దేహమే నేననే ప్రమాదమునకు గురౌతున్నాడు. మనిషిలో వున్న 'నేను' అనే చిత్ తత్త్వమును ఆత్మ స్వరూపకముగా విశ్వసించి, ఆనందమును అనుభవించి, పరులకు పంచటమే పవిత్రమైన చరిత్రలయొక్క స్వభావము.

## మానవత్వమును సార్థకము చేసుకోలేని దేహము నిరర్థకమైనది

అహంబ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మ బ్రహ్మ, తత్త్వమసి అనే మహావాక్యములయొక్క అంతరార్థమును గుర్తించి, విశ్వసించి, ఆచరణయందు వుంచినప్పుడే ఆత్మ స్వరూపాన్ని గుర్తించుటకు వీలవుతుంది. ప్రాచీనకాలమునుండి

భారతీయులు అనేక విధములైన ఆదర్శములను అనుభవించి, యిందులో ప్రధానమైన సారాంశమును గుర్తించి, గుణమే అన్నింటికంటే ప్రధానము అని అర్థము చేసుకున్నారు. ధనము కోల్పోయినా వారు అంత బాధపడేవారు కాదు. ఆరోగ్యమును కోల్పోయినాకూడను వారు చింతించేవారు కాదు. ఏదో కొన్ని కష్టనష్టములకు గురై తిరిగి ఆరోగ్యమును, ధనమును సంపాదించవచ్చని భావించెడివారు. ఇక, గుణము పోయిన, ప్రాణమే పోయినట్టుగా చింతించేవారు. యీనాటి విద్యార్థులు, విద్యార్థినులు యీ మూడు సత్యములను గుర్తించి వర్తించటము అత్యవసరము: If wealth is lost, nothing is lost; if health is lost, something is lost; if character is lost, everything is lost. ఈ సత్యవాక్యమును ఆధారము చేసుకొని వారు తమ జీవితమును కొనసాగిస్తూ వచ్చారు. కానీ నేటి విద్యార్థులు తమయొక్క సంకల్పములను గుర్తించుకొనక మితిమీరిన స్వేచ్ఛకు దారినిచ్చి గతులను తప్పి, మతులను చెరచుకొని, దుర్గతిని అనుభవిస్తున్నారు. ఆనాటి పవిత్రమైన యీ సూత్రమును ప్రక్కదారి పట్టిస్తున్నారు. ఒక కారు గానీ బస్సుగానీ ట్రైనుగానీ రివర్సుగేరు వేసి డ్రైవ్ చేసినప్పుడు అది వెనుకకు పోతుందిగానీ ముందుకు పోదు. ఈనాటి విద్యార్థులు యీ రివర్సుగేరులోపల ప్రయాణము సలుపుతున్నారు. If character is lost, nothing is lost అంటారు. If wealth is lost, something is lost అంటారు. If health is lost, everything is lost అంటారు. ఏమిటి యీ health? Health ఎందుకోసం వుండాలి? దేహమును సన్మార్గములో సత్కర్మలలో ప్రవేశపెట్టినట్లైన యీ health అవసరమే! అయితే, దుర్మార్గమునందు, దుష్ప్రవర్తనయందు ప్రవేశింపజేసే దేహము వుండుటకంటే పోవటం మంచిది. మానవత్వమును సార్థకము చేసుకోలేని దేహము నిరర్థకమనే చింతన చాలా మంచిది. కనుక, దేహముయొక్క ఆరోగ్యము ప్రధానముకాదు.

**మంచి, చెడులయొక్క ప్రభావము మనసుపై ఆధారపడి ఉంటుంది**

మనస్సుకు యోచన ఆత్యవసరమైనది. మనము సత్సంకల్పములు అభివృద్ధి పరచుకున్నప్పుడే దీనిని సన్మార్గములో ప్రవేశపెట్టుటకు వీలవుతుంది. ఆనాటి మహనీయులు ఒక్కొక్క సంకల్పముకూడను ఉత్తమమైన మార్గములో ప్రవేశపెడుతూ వచ్చారు. కోపము చాలా చెడ్డదని వారు భావిస్తూవచ్చారు. అయితే ఆ కోపముకూడను

పూర్తిగా చెడ్డది కాదు. సమయసందర్భములను పురస్కరించుకొని కోపము చాలా వుపకారిగానే వుంటుంది. క్షమ, కరుణ చాలా మంచివని భావించెడివారు. కానీ ఆ క్షమ, కరుణలుకూడను సమయ సందర్భములనుబట్టి వుపయోగించుకోకపోతే దుష్ఫలితాలను ఇస్తాయి. దూర్వాసుడు తన కోపమును ఒక తపస్సుగా భావిస్తూవచ్చాడు. ఆ తపస్సే అగ్నిగా విశ్వసిస్తూ వచ్చాడు. ఈ కోపమునే జలముగా విశ్వసిస్తూ వచ్చాడు. తపస్సు అగ్ని, కోపము జలము. అయితే, అగ్నిని జలము ఆర్పగలదు. కొన్ని కొన్ని సమయములందు జలమునందే అగ్నిని సృష్టించవచ్చు. కనుక జలమునందు అగ్ని, అగ్నియందు జలము విలీనమై వుంటున్నవి. వీటిని వుపయోగించుకొనే విధానములోనే మంచి చెడ్డలు రూపొందుతూ వస్తున్నాయి. స్వార్థరహితమైన కోపముకూడను చాలా ఉత్తమమైన ఫలితమును చేకూరుస్తుంది. ధర్మబద్ధమైన కోపము వుపకారమునే గావిస్తుంది. ఇతరులయొక్క అజ్ఞానము, అహంకారము, అసూయ, మమత్వములను దూరము గావించుటకై యీ కోపము కొంతవరకు వుపయోగపెట్టవలసి వస్తుంది. మహనీయుల కోపము ఎల్లప్పుడు మంచినే చేస్తుంది. కారణము, వారు తమ కోపమును స్వార్థరహితమైన కార్యములలో ప్రవేశపెడతారు. పవిత్రమైన కార్యములు నెరవేర్చే నిమిత్తమై, మానవునియొక్క దుష్ప్రవర్తనను అణగద్రొక్కే నిమిత్తమై, అజ్ఞానమును, అహంకారమును రూపుమాపే నిమిత్తమై, పరులను రక్షించే నిమిత్తమై కొన్ని కొన్ని సందర్భములందు కోపము వుపయోగపెట్టవలసి వస్తుంది. ఈ విధంగా దూర్వాసునియొక్క కోపము మంచినే చేస్తూ వచ్చింది. కనుక, అతను స్వార్థరహితమైన కార్యములందు తన కోపమును వుపయోగపెడుతూ వచ్చాడు. సత్యమును వీడక, ధర్మమును వుల్లంఘించక స్వార్థరహితమైన కార్యములలో కోపమును వుపయోగపెట్టనప్పటికిని యిది పవిత్రమైన మార్గములోనే ప్రయాణము సలుపుతుంది.

అదే విధముగనే శాంతి, క్షమ, కరుణ. ఇవి సద్గుణములే అయినప్పటికిని, కొన్నికొన్ని సమయములందు కొన్ని ధర్మములకు విరుద్ధముగా రూపొందుతాయి. పరిపాలనాదక్షుడైన రాజు విచక్షణారహితంగా దయ, కరుణ, క్షమలను ప్రదర్శించిన రాజ్య పరిపాలనే స్తంభించిపోతుంది. తప్పు చేసిన వారినందరిని క్షమిస్తూ, దుర్మార్గులైన వారినందరినీ

కరుణిస్తూ దయతో వారిని చూస్తూ పోయినప్పుడు అతనియొక్క పరిపాలనా పద్ధతి పూర్తిగా పెడమార్గము పడుతుంది. ఏనుగుకు అంకుశమెట్లు ప్రధానమో, గుఱ్ఱమునకు కళ్ళెము యెంత ప్రధానమో, తప్పునకు శిక్షకూడను అంత ప్రధానము. ఆ శిక్షయే లేకుండిన రక్షణే జరుగదు. కనుకనే మానవత్వములో కొన్ని సంకల్పములు ఉత్తమముగాను, కొన్ని సంకల్పములు చెడ్డవిగాను మనము విశ్వసించవచ్చు. కాని, ఈ మంచి చెడ్డలయొక్క ప్రభావములు మనసుపై ఆధారపడి వుంటున్నాయి. కనుక, మనస్సు పరిశుద్ధమైన, స్వార్థరహితమైన మార్గమునవలంబించినప్పుడు సర్వముకూడను మంచిగానే రూపొందుతుంది. ఈ కారణంచేత సంకల్పములయొక్క ప్రభావమునుకూడను అతి సూక్ష్మముగా విచారించవలసివస్తుంది. భౌతికముగా, ప్రాకృతికంగా సంకల్పములయొక్క స్వరూపాన్ని మనము విశ్వసించటము చాలా కష్టము.

**సంకల్పములు పవిత్రముగా వున్నప్పుడు ఫలితముకూడా మంచిగానే రూపొందుతుంది**

హృదయమునందు ఎట్టి దుర్భావములు లేక సంకల్పములను పరిశుద్ధముగా ఆవిర్భవింపజేసుకొని 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అందరూ క్షేమంగా వుండాలి అనే సంకల్పములు మనము పోషించుకున్నప్పుడు సర్వముకూడను మంచిగానే రూపొందుతుంది. కనుక, మన మనస్సులో సంకల్పములు పుట్టిన తక్షణమే యివి మంచివా చెడ్డవా అనే విచారణ సల్పాలి. నిరంతరము చెడు సంకల్పములనే అభివృద్ధిపరచుకొన్న మన జీవితమే చెడు మార్గములో ప్రవేశిస్తుంది. ఈనాడు యిద్దరు ఫ్రెండ్సుకు డిన్నరు చెయ్యాలని అనుకున్నాము. అయితే, ఆ యిరువురితోబాటు మనంకూడను భుజిస్తున్నాము. మనం అనుకోటం ఈ డిన్నరు పరులకోసం ఇచ్చినట్లుగా భావిస్తున్నాం. కాని, పరులకోసం తలపెట్టిన దానిని మనంకూడను అనుభవిస్తున్నాము. అదే విధముగనే చెడ్డకూడను పరులకోసమని మనము చింతించిన ఆ సంకల్పముయొక్క ఫలితము మనకుకూడను లభిస్తుంది. మనలనుకూడను హింసిస్తుంది. ఒక సందర్భములో కోపంతో దేశము నాశనమై పోవాలని సంకల్పించుకుంటామనుకోండి. కాని, దేశముతో పాటు, దేశములో వున్న మనముకూడా నాశనము కావలసి వస్తుంది.

sri sathyasai vachanamrutam

సంకల్పము ఒక్కటైనప్పటికి యిది అనేక రూపములను ధరిస్తూ వుంటుంది. ఒక్క సంకల్పములోనే అనేక సంకల్పములుకూడను ఇమిడి ఉంటాయి. మనకు టీ పార్టీ చెయ్యాలని ఒక సంకల్పము వచ్చింది. టీ పార్టీ అనేది ఒక్కటే సంకల్పము. దానితోబాటు ప్లేట్లు, సాసర్సు, పాలు, కాఫీ, బిస్కట్లు అన్నీకూడను ఆవిర్భవిస్తున్నాయి. ఇంక స్నేహితులు వస్తున్నారంటే వాళ్లకు, ఛైర్సు, టేబుల్సు, టేబుల్‌క్లాత్ యివన్నీకూడను సంకల్పముతో ఆవిర్భవిస్తున్నాయి. కనుక, ఒక్క టీ పార్టీ అనే సంకల్పము యింకా ఎన్నో పదార్థములను తెచ్చిపెట్టాలన్న సంకల్పములావిర్భవింపజేస్తున్నాయి. సంకల్పమనేది ఒక్కటేనని నీవు భావించవచ్చును. కాని అది అనేకముగా రూపుదాలుస్తుంది. ఈ విధంగా అనేక రూపములు దాల్చిన సంకల్పములు అనేక క్రియలుగా రూపొందుతున్నాయి. కనుక, సంకల్పములయొక్క ప్రభావాన్ని మనము చక్కగా గుర్తించటము అత్యవసరము.

**మానవులయందు మంచి సంకల్పములే ఉద్భవించాలి**

మనము మానవులుగా పుట్టినాము. మానవులయందు మంచి సంకల్పములే ఉద్భవించాలి. అజ్ఞానరహితుడు, మానవుడు. కాని, మానవునకు అజ్ఞానము సహజమని మనము భావిస్తున్నాము. 'యీ అజ్ఞానము నాకు సహజమ'ని భావించటమే ఒక పెద్ద అజ్ఞానము. అజ్ఞానము నీకు సహజముకాదు, అసహజము. లేకుండిన 'జంతూనాం నరజన్మ దుర్లభమ్', అని ఎట్లు చెప్పగలవు? వీలులేదు. కనుక, ప్రాచీన కాలమునుండియు మానవునియొక్క అభివృద్ధికోసమని, మానవునియొక్క వున్నతస్థితికోసమని, మానవత్వమును దివ్యత్వమునకు చేర్చే మార్గముకోసమని, ప్రపంచములో ధర్మము ఉంటూవచ్చింది. దీనిని కొంతవరకు మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కానీ, యీనాటి యువత చతుర్విధ పురుషార్థములలోని ధర్మమోక్షములనే ఆద్యంతములు మరచిపోతున్నారు. కేవలం మధ్యనున్న అర్థకామములనే మొండెమును పట్టుకుని వ్రేలాడుతున్నారు. అర్థకామములే ప్రధానమని భావిస్తున్నారు. ఈ అర్థకామములు ధర్మమయమై మోక్షసాధనకు కాకుండిన అవి మహాప్రమాదమును కలిగిస్తాయి. ధర్మము అర్థముతో కలసి ధర్మార్థముగా మారి యీ ధర్మార్థములు రెండూ చేరి కామము దగ్గర ప్రవేశించి, ధర్మమయమైన కామమును అనుభవించి యీ మూడుకూడను

ధర్మమయమైనప్పుడు మోక్షము మనలను వరిస్తుంది. మనము అర్థమునుకూడను ధర్మమయము గావించాలి. మన వాంఛలనుకూడను ధర్మమయము గావించాలి. ధర్మార్థకామమోక్షములనే చతుర్విధపురుషార్థములందు ధర్మము అంతర్భూతమై వుండాలి. ఈ విధమైన మార్గము అవలంబించినప్పుడే మనము పురుషార్థములు సార్థకము గావించుకున్నవారమవుతాము. ఈనాడు పెండ్లిండ్లయందు 'ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరామి' అని యీమూడింటిని గురించి చెబుతున్నారుగానీ మోక్షమును విస్మరిస్తున్నారు. కనుక, యీ ధర్మమోక్షములు ప్రధానమైన లక్ష్యమునందుంచుకోవాలి. ఈ విధమైన లక్ష్యమును అర్థము చేసుకొని ప్రాచీనులు తమ జీవితగమ్యము చేరుతూ వచ్చారు. ఈనాటి మానవులకు గమ్యమేమీ అక్కరలేదు. ఏదో స్వేచ్ఛా విహారము సలుపుతూ ఎక్కడో ఒకచోట అంతమైపోతున్నారు. అదికాదు, మానవునియొక్క కర్తవ్యము. 'ఎచ్చట పుట్టెనో అచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్'. ఎక్కడనుండి వస్తిమో అక్కడకు చేరటమనేది మనయొక్క లక్ష్యమై వుండాలి. ఈ యొక్క గమ్యమును చేరుటకై సత్సంకల్పములు మనము పోషించుకోవాలి. ఎట్టి సాధనలు సలుపక పోయినప్పటికి సత్సంకల్పములు పోషించుకుని, సన్మార్గములో ప్రవేశించి సత్సంగమును చేరి మనయొక్క జన్మ సార్థకముగావించుకోవాలి.

**త్రికరణశుద్ధితో చేసే సంకల్పమే ఉత్తమ సంకల్పము**

దేహము నీటి బుడగ వంటిది. ఏ నిమిషమో, ఏక్షణమో, ఎక్కడ కూలిపోవునో, ఎక్కడ రాలి పోవునో! కనుక, మన సంకల్పములు ఎప్పటికప్పుడు మంచి సంకల్పములుగా రూపొందింప చేసుకోవాలి. సత్ సంకల్పములు కలిగిన మానవునకు సర్వము తన హస్తగతమై పోతుంది. మనము చేసే సర్వ కర్మలు సంకల్పములయొక్క స్వరూపమే. సంకల్పములే లేకుండిన సర్వము శూన్యమై పోతుంది. కనుక, జగత్తంతయు హిరణ్యగర్భుని వంటిది. ప్రప్రథమముగా సంకల్పమే ప్రధానమైనది. అదే దీని ఆధారము అన్నారు. కనుక, సంకల్పములను పవిత్రమైనవిగా మనము రూపొందింపచేసుకోటం చాలా అవసరము. దుస్సంకల్పములను లోపల వుంచుకొని పైపైన మంచిగా మనము నటించవచ్చు. అది ప్రయోజనము కాదు. మనస్సునందు, వాక్కునందు, క్రియయందు యీ మూడింటియందు యేకత్వము కావాలి. కనుక, యిట్టి త్రికరణశుద్ధితో చేసే సంకల్పమే

srisathyasaivahini.org

ఉత్తమమైన సంకల్పము. అప్పుడే పూర్ణమానవుడుగా రూపొందుతాడు. The proper study of mankind is man. మన సంకల్పము, మన మాట, మన క్రియ యీ మూడు ఏకమైనప్పుడే mankind అవుతుంది. జగత్తులో అనేక విధములైన భిన్నత్వములు కనుపిస్తున్నవి. కాని, యీ భిన్నత్వములో వున్న యేకత్వమును గుర్తించాలి. ఈ ఏకత్వములో వుండిన ఆనందమును మనము చవి చూడాలి. అప్పుడే దివ్యత్వము అర్థము చేసుకున్నవారమవుతాము. ఈనాడు అనేకత్వములో వున్న యేకత్వమును గుర్తించక, ఏకత్వమును, అనేకత్వముగా మనము రూపొందింపజేసుకుంటున్నాము.

**ఇతరుల మంచిని కోరినప్పుడే మనయందు సత్సంకల్పములు ఉద్భవిస్తాయి**

ఎక్కడ చూచినా యీనాడు మానవుడు దుఃఖమయమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఏ మానవుడుకూడా శాంతి, భద్రతలను అనుభవించటంలేదు. కారణము, తన నిండుకు దుస్సంకల్పములే! ఈ విధమైన దుస్సంకల్పములను మనము దూరము చేసుకోవాలి. ఈ వయస్సు చాలా పవిత్రమైన వయస్సు. 'ఎవరికి ఏది చేసినప్పటికి అది తిరిగి మనకు వస్తుంది', అనే విశ్వాసమును మనము అభివృద్ధి పరచుకోవాలి. అట్టి విశ్వాసము వుండినప్పుడే మనము యితరులకు చెడ్డ చేయకుండా వుంటాము. 'ఏదో యిప్పుడు చేయవలసినది మనము చేస్తాము తరువాత ఎప్పుడు వస్తుందో చూచుకుందాము', అంటే అది చాలా తప్పు ఆలోచన. ఇది కేవలము రజోగుణరూపకముగా రూపొందుతుంది. కామక్రోధములకు రెండింటికి పుట్టినయిల్లు, రజోగుణమే. ఈ రజోగుణమనేది మానవుని హతమారుస్తుంది. సాత్త్వికమైన సంకల్పములచేత సాత్త్వికమైన మానవుడుగా తయారుకావాలి. ఇదే నిజమైన విద్య. ఈ విద్యను మనము అభ్యసించినప్పుడే మనము ఆత్మ విద్యను అభ్యసించడానికి అర్హులమవుతాము. కేవలము లౌకిక విద్యలందుకూడను సక్రమమైన మార్గమును అవలంబిస్తాము. విద్య, తపస్సులు రెండిటియొక్క సమ్మిళితమే నిజమైన దివ్యత్వము. తపస్సనగా ఏమిటి? మనస్సు, వాక్కు, క్రియ మూడింటిని యేకము చేయటమే తపస్సు. ఎక్కడో అరణ్యమునకు వెళ్లి గుహలలో కూర్చొని దైవమును చింతించటము మాత్రమే తపస్సు కాదు. సత్త్వ, రజో, తమో గుణములనే త్రిగుణములను

srisathyasaivachanamrutam

యేకము గావించి, మనస్సును దివ్యమైన భావములలో ప్రవేశింప జేయటమే తపస్సు. ఈ విధముగా త్రిగుణములయొక్క యేకత్వమే గావించకుండిన యిది తమస్సుగా మారిపోతుంది. కనుక మనము తమోస్వరూపులు కాకూడదు. తపఃస్వరూపులు కావాలి. నిరంతరము సత్సంకల్పములయొక్క తపమును ఆచరించాలి. ఆ సత్సంకల్పములయొక్క తాపమే తపస్సుగా మారిపోవాలి. కనుక, యీ సంకల్పములను ప్రాణసమానముగా మనము విశ్వసించాలి. ఇవి సత్సంకల్పములుగా మనము తీర్చిదిద్దుకోవాలి. ఎవరికి యే సమయమునందు అపకారముగానీ, కీడుగానీ మనము తలంచరాదు. అందుకోసమనే 'చెడపకురా చెడెదవు' అన్నారు. యితరుల చెడుపును మనము కోరుతుంటే మనకుకూడను చెడుపు సంభవిస్తుంది. ఒక బాల్‌ను తీసుకొని గోడకు గట్టిగా కొట్టినప్పుడు ఆ బాల్ తిరిగి యెంత గట్టిగా కొట్టామో అంత వెనుకకు వస్తుంది. ఒకరి దోషాన్ని మనము చూపుతూ వస్తుంటే తిరిగి మూడు దోషాలు మనని చూపుతాయి. వీడు చెడ్డవాడు అని ఒక వేలుతో వానిని చూపుతే మూడు వేళ్లు నీవు చెడ్డ అని చూపిస్తాయి. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించి వర్తించాలి. నీవు మూడు విధములుగా చెడ్డవాడవైవుండి పరులయొక్క ఒక్క దోషాన్ని చూపటానికి ప్రయత్నిస్తున్నావు. నీవు చూపేవాని దోషములకంటే యెక్కువ దోషములు నీలో వున్నాయి. ఎక్కువ దోషములు కలిగినవాడే పరులయొక్క దోషమును పరికిస్తాడు. ఈ సత్యమును మనము చక్కగా గుర్తించాలి. కనుక ఎవ్వరిని మనము నిందించరాదు. ఎవరిని మనము బాధించరాదు. ఎవరి చెడ్డను మనము కోరరాదు. అందరి మంచిని మనము కోరుతూరావాలి. అప్పుడే నీ హృదయమునందు చక్కని పవిత్రమైన సంకల్పములు అభివృద్ధి అవుతాయి.

### సంకల్పములయొక్క పరిణామమే మన ప్రవర్తన

మనస్సంటే సంకల్పములయొక్క చేరికగా మనము గుర్తించాలి. మనస్సంటే మనిషే; మనిషంటే మనస్సే! మనస్సంటే సంకల్పములే. సంకల్పములనగా మన నిత్యజీవితములో మనయొక్క ప్రవర్తనలే. కనుక, సంకల్పములయొక్క పరిణామమే మన ప్రవర్తన. కనుక, మన ప్రవర్తన మంచిగా వుంటుండాలి. మన ప్రవర్తన మంచిగా వుండినప్పుడే ప్రపంచము

srisathyasaivachanamrutam

మంచిదిగా వుంటుంది. కనుక, మన వ్యక్తిత్వాన్ని మనము పోషించుకునే నిమిత్తమై మన ప్రవర్తన అతి పవిత్రమైనదిగా రూపొందింప జేసుకోవాలి. అదే character అన్నారు. Character అంటే యేదో కొన్ని రకములైన మంచిగుణములు కలిగినంత మాత్రమున character కాదు. మన behaviour, మన habits, మన discipline యివన్నీకూడను సక్రమమైనవిగా వుంటుండాలి. మన నడతలు, మన మాటలు, మన చూపులు, మన వినికిడి, మన హృదయము అన్నింటియొక్క పవిత్రతను చేకూర్చుకోవాలి. కనుకనే 'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనం' అన్నారు. అదే మన character కు సరైన గుర్తు. 'మనస్ అన్యత్, కర్మణ్ అన్యత్, వచస్ అన్యత్ దురాత్మానం' అన్నారు. అదే మన చెడు మార్గములకు మూలకారణము. మన చూపును పవిత్రమైన చూపుగా రూపొందింపచేసుకోవాలి. మనము చెడ్డ విషయాలు వినటానికి ప్రయత్నించకూడదు. ఎప్పుడూ మనము చెడ్డమాటలను మాట్లాడకూడదు. ఈ విధంగా మన చిత్తమును పరిశుద్ధమైన చిత్తముగా రూపొందింపజేసుకోవాలి.

### శ్రీ సత్యసాయి విద్యాసంస్థయందు ప్రధానముగా బోధింపబడే విద్య, శీలపోషణే!

రామాయణమునందు కొన్ని చక్కని ఘట్టాలంతా వుంటున్నాయి. ఈనాటి యువకులు వాటిని చక్కగా అర్థము చేసుకుని పాటించాలి. లక్ష్మణునియొక్క character నుగురించి యెన్నో విధములుగా రామాయణము వర్ణిస్తూ వచ్చింది. పదునాల్గు సంవత్సరములు అరణ్యములో వంటరిగా వుండినప్పటికి అతడు సీతముఖము ఒక్కనాడైనా చూచి ఎరుగడు. ఋష్యమూక పర్వతముపై సుగ్రీవుని చేతికి చిక్కిన ఆభరణములు రాముడు తనకు చూపించి వాటిని గుర్తుపట్టమని కోరినప్పుడు లక్ష్మణుడు చెప్పుతున్నాడు: "అన్నా! యీ కేయూరములు, యీ కర్ణఆభరణములు నాకు తెలియవు. ఏనాడు నేను వాటిని చూడలేదు. ఇవి సీతవో కావో నాకు తెలియదు. కాని ఈ కాలి అందెలు మాత్రము నాకు తెలుసు. సీతామాతకు నిత్యము పాదాభివందనం చేసే సమయములో ఆమె కాలికి ఉన్న ఈ అందెలు మాత్రం నేను చూచాను", అన్నాడు. ఇదే కాకుండా ఒకానొక సమయములో ప్రపంచమునకు లక్ష్మణునియొక్క పవిత్రతను ఆదర్శముగా నిరూపించే నిమిత్తమై రాములు

srisathyasaivachanamrutam

కొన్ని పరీక్షలకుకూడను పూనుకున్నాడు. “లక్ష్మణునియొక్క పవిత్రత నాకు తెలుసు; కానీ లోకము యెరుగదు. అందువలన అతడిని కొన్ని పరీక్షలకు గురి చెయ్యాలి”, అనుకున్నాడు. ఒకానొక సమయములో రామ, లక్ష్మణ, సీతలు ముప్వురు ఒక వృక్షముక్రింద విశ్రాంతి తీసుకుంటున్నారు. లక్ష్మణునియొక్క పవిత్రతను ప్రపంచమునకు చాటే నిమిత్తమై రాములు ఒక చిన్నయుక్తి పన్నాడు. “లక్ష్మణా! నేను కొంత బయటప్రదేశానికి పోవలసి వస్తుంది. నువ్వు యిక్కడేవుండి సీతను కాపాడుతూ వుండు. యిది చాలా దట్టమైన అడవి. రాక్షసుల మాయలు అనేక రకములుగా వుంటున్నాయి, నీవు యేమాత్రముకూడను ఏమరుపాటులేక సీతను కనిపెట్టుకుని వుంటుండు”, అని చెప్పాడు. ఇది లక్ష్మణునికి ఒక పరీక్షగా తోచింది. సీతపాదములనే చూస్తూవున్నాడు. కొంతసేపు అయ్యేటప్పటికి ఆ వృక్షముమీద ఒక పక్షి వచ్చి వాలివుంది. రాముడు ఆ విధంగా పక్షి రూపమును ధరించి వచ్చాడు. ఎన్ని ఆటంకములు ఎదురైనా సరే తాను సీతను సరైన రీతిగా కాపాడుతూ రావాలని ప్రతిజ్ఞ చేసుకున్నాడు, లక్ష్మణుడు. ఆ చెట్టుపైన వున్న పక్షి “అతి మధురమైన పండును చూచినప్పుడు, పరిమళమైన పుష్పమును ధరించినప్పుడు, వంటరిగా ఉన్న ఒక యువతిని చూచినప్పుడు ఒక యువకుడు యేరీతిగా వుండాలి” అనే ఒక ప్రశ్న వేసింది. లక్ష్మణుడు దానికి జవాబుగా “సుశీలవంతుడైన తండ్రికి, పతివ్రతయైన తల్లికి పుట్టిన యే మానవుడుకూడను దీనికి చలించడ”ని జవాబు యిచ్చాడు. “తల్లియందో, తండ్రియందో కొంతదోషము వుండినవాడే యిలాంటి సందర్భములో అపవిత్రమైన భావాలకు గురి అవుతాడు గాని యిరువురి యందును శుద్ధమైన, పవిత్రమైన భావాలు వున్నప్పుడు ఏనాడు యిటువంటి అపవిత్రమైన భావములకు పాల్పడడు”, అన్నాడు. మరొక ప్రశ్న వేసింది, చిలుక. “మదగజమువలె మనసు సంచరించే సమయమునందు (అనగా మంచిచెడ్డలను విస్మరించి కేవలము స్వేచ్ఛా విహారము సలిపే సందర్భములోపల) యువకుడైనవాడు యేవిధమైన నిగ్రహము చేయగలడు?” అని. అందుకు లక్ష్మణుడు “మదగజమైనప్పటికిని, స్వేచ్ఛావిహారము సల్పినప్పటికి, జ్ఞానమనే అంకుశముచేత దానిని అరికట్టగలడు. ఈ జ్ఞానమనే అంకుశము కల్గినవానిని యేమదగజము, యేమీ, చేయలేద”న్నాడు. తక్షణమే రాముడు చిలుక స్వరూపాన్ని విడిచి తన నిజస్వరూపముతో “లక్ష్మణా! నీ నిమిత్తమే కాదు.

srisathyasaivahamrutam

నీ సత్యము నాకు తెలుసు. కానీ, లోకానికి వ్యక్తము గావించే నిమిత్తమై నేను యీ రకంగా నిన్ను పరీక్షించాను" అన్నాడు.

కనుక, యువకులైనవారు యిలాంటి పవిత్రమైన శీలము నభివృద్ధి పరచుకున్నప్పుడే పరిపూర్ణ మానవులు కాగలరు. మన విద్యాసంస్థయందు ప్రధానమైన విద్య మన శీలపోషణే! అదిలేని విద్యలు ఎన్నివుండి ప్రయోజనమేమిటి? ఈ విద్యలన్నీ చెత్త చదువులే! ఎన్ని శాస్త్ర, యితిహాస, పురాణములు చదివినప్పటికి, ఎన్ని విధములైన ప్రాపంచిక రహస్యాలను గుర్తించినవారమైనప్పటికి, గుణము లేకపోతే అవన్నీ నిష్ప్రయోజనమే! కనుక, విద్యలతోపాటు మన గుణములు పోషించుకోవాలి.

**సకల శాస్త్ర పురాణ సంగ్రహ వేత్తయై**<br>
**వేదాంతములు నేర్చు విప్రుడైన**<br>
**రక్తి యేపారగ రమ్య హర్మ్యంబుల**<br>
**రమియించు రాజాధి రాజులైన**<br>
**రణరంగ మందు పరాభూతరిపుడౌచు**<br>
**వెల్గొందు జగదేక వీరుడైన**<br>
**దారిద్ర్యదేవత దాక్షిణ్యమున కుందు**<br>
**దౌర్భాగ్య విభుడగు దాసుడైన**<br>
**గుణము లేనిచో ఎందుకు పనికిరాడు**

గుణము లేనప్పుడు మన చదువులెందుకు? మన సంపద ఎందుకు? మన జీవితమెందుకు? కనుక మన జీవితాన్ని, మన సంపదను, మన సర్వస్వాన్నికూడను ధారపోసి దానిని మనం సంపాదించుకోవాలి. ఇదే మన ప్రధానమైన సంకల్పముగా మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ ఒక్క సంకల్పమును మనము అభివృద్ధి పరచుకుంటే సర్వాన్ని జయించినవారమవుతాము.

**ఇంద్రియ నిగ్రహము కలవాడే మహారాజు**

యింద్రియాలను మనము నిగ్రహించుకోవాలి. చిన్న పిల్లవాడు ప్రహ్లాదుడు. మీకు

srisathyasaivachanamrutam

సోదరునివంటివాడు. ఆ పిల్లవాడు మహారాక్షసుడైన హిరణ్యకశిపునికి చెప్తున్నాడు: "తండ్రీ! లోకములన్నియు గడియలోన జయించినవాడవు ఇంద్రియానీకము చిత్తము గెలువనేరవు. ఎన్ని జయించి ప్రయోజనమేమిటి? నీ యొక్క యింద్రియాలు జయించలేనివాడవు ఎన్ని రాజ్యాలు జయించి ప్రయోజనమేమిటి?" అని. హిరణ్యకశిపుడు గొప్ప శాస్త్రవేత్త. సముద్రాలను శోధించినాడు. భూమినంతా త్రవ్వి శోధించినాడు. పరమాత్మునియొక్క ఉనికి ఎక్కడని, సర్వత్ర వెదకి చూచాడు. అతడు సమస్త శక్తివంతుడు. అంతటి మహాశక్తి సంపన్నుడైన హిరణ్యకశిపుడుకూడను తన యింద్రియములను తాను జయించలేకపోయాడు. కారణము, 'పశ్యతీతి పశుః'. తన దృష్టినంతయు బాహ్యమైన ప్రకృతిపైననే పెట్టుకున్నాడు. బయటి దృష్టిని మాత్రమే అభివృద్ధిపరచుకున్నాడు. అంతదృష్టిని యేమాత్రము చింతించలేదు. మనముకూడను బయటదృష్టిని అలవరచుకున్నంతవరకు పశువులమే-పశువులమే-పశువులమే! ఏనాడు అంతర్భావములను మనము అభివృద్ధి పరచుకొందుమో ఆనాడే మనము చక్రవర్తులము. అందువలననే ప్రహ్లాదుడు తండ్రితో రాజాధిరాజ! మహారాజ రాజా! యింద్రియములను జయించుకుంటే నీవు అన్ని రాజ్యములకు రాజైన వాడవౌతావు', అని బోధించాడు.

**ఉత్తమాదర్శములతో నిజమైన మానవునిగా జీవించాలి**

అలాంటి వ్యక్తులు మన Institute లో తయారుకావాలి. విద్యతోపాటు వివేకము, వివేకముతోపాటు విచక్షణ, విచక్షణతోపాటు వినయము చేరినప్పుడే రాణిస్తాడు, మానవుడు. వినయములేని విద్య విద్యకాదు. విజ్ఞతలేని విద్య విద్యకాదు. కేవలము విజ్ఞానము వుండినంత మాత్రమున ప్రయోజనమేమిటి? ఉపయోగములేని విజ్ఞానముకంటెను వుపయోగపడే అజ్ఞానమే మేలు. అందువల్లనే నేను అప్పుడప్పుడు చెబుతూ వుంటాను 'పంటపండని భూమి పది ఎకరములేల? కొంచమైన చాలు మంచి భూమి'. మనము పెద్ద పెద్ద డిగ్రీలు ఆశించనక్కరలేదు. A,B,C,D మొదలుకొని Z వరకు నీవు డిగ్రీలు తీసుకున్నప్పటికిని ఆ జ్ఞానము ఆచరణలో పెట్టుకుండిన నీవు కేవలము ఒక శుంఠవే! ఏమిటి యీ విద్యలు? కుక్కలుకూడను విద్యలు నేర్పితే నేర్చుకుంటాయి.

పూర్వకాలములో దున్నపోతుకూడను వేదము చెప్పిందంట! కోతులిప్పుడు సైకిలు త్రొక్కటం లేదా? నేర్పిస్తే గొఱ్ఱెలు, మేకలుకూడను సర్కస్‌లో ఎన్నో పనులు చేస్తున్నాయి. కేవలము నేర్చుకుని అప్పజెప్పే విద్యలు విద్యలవుతాయా? విద్య ఆచరణలో పెట్టి యితరులకు ఆదర్శప్రాయముగా మనము జీవించాలి. అదే నిజమైన విద్య. ఆదర్శప్రాయమైన జీవితము మనము గడపాలి. ఎట్టి ఆదర్శము? ఉత్తమ ఆదర్శము. మానవునిగా మనం బ్రతకాలి. మానవునిగా జీవించాలి. మానవునిగా చావాలి. మానవునిగా పుట్టి, మనము రాక్షసునిగా మరణించరాదు.

## దైవము మీకంటే వేరుకాదు

యీ సత్సంకల్పములను చక్కగా అభివృద్ధి పరచుకుంటే మనమే దైవస్వరూపులమవుతాము. మనము యేదో కొంతకాలము మాత్రమే ఆచరించటముకాదు. జీవిత పర్యంతము దీనిని అనుసరించాలి. ఈ గాఢ విశ్వాసము పొందాలనుకున్నప్పుడు మీరు దైవాంశమనే సత్యాన్ని విశ్వసించాలి. మీనుండి దైవము వేరని మీరు భావించరాదు. ఈ భావన మీయందు లేకపోతే ఏ కొంతకాలమో మీరు భక్తి ప్రపత్తులతో వుండవచ్చు. తిరిగి బయట ప్రపంచానికి పోతూనే, మీరు నాస్తికులుగా తయారౌతారు. కనుక, యేక్షణమైనాకూడను, ఎక్కడవుండినప్పటికి మనము దైవాంశమే అనే భావాన్ని మీరు ధృడం చేసుకోవాలి. దైవాంశములైన మీకు దైవగుణములంతా రావాలి. అట్లు చేసిన నీవు పెడమార్గం పట్టవు. లేకుండిన ఏ క్షణమైనా నీవు పెడమార్గము పట్టవచ్చు. దుష్టబుద్ధులకు నీవు లోబడవచ్చును. చేసిన ఉపకారము మరచిపోవచ్చును. ఉపకారికి అపకారము గావించవచ్చును. మొట్టమొదట మీరు యీ అంశమును గుర్తుంచుకొని మీ జీవితయాత్రను కొనసాగించడానికి ప్రయత్నించటం చాలా ప్రధానమైన విషయమని నేను హెచ్చరిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 4-09-1986న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam